రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప వివరాల ప్రకారం.. విద్యానగర్‌ ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్‌ ఖాజా (32) శనివారం రైలుకింద పడి ఆత్మహత్యకు ప్రయత్నించగా రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం గాంధి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గంజాయి విక్రేతల అరెస్టు



ముషీరాబాద్‌: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన ఘటన ముషీరాబాద్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ రామకృష్ణ వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన మహ్మద్‌ సమీద్‌(25), బోయిగూడకు చెందిన బి.కుషాల్‌(25) నాగ్‌పూర్‌ నుంచి పొడి గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. శనివారం ఇరువురు ఆటోలో 1.2 కిలోల పొడి గంజాయిని తీసుకెళ్తుండగా అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడటంతో ఇద్దరిని అరెస్టు చేశారు.

ఇంటి దోషం తొలగిస్తానని బురిడీ బాబా మోసం

20 తులాల బంగారం, రూ.లక్షన్నర స్వాహా, కేసు నమోదు

కాచిగూడ: ఓ మహిళా లెక్చరర్‌ బురిడీ బాబాను ఆశ్రయించి మోసపోయిన ఘటన కాచిగూడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై నరేష్‌ కుమార్‌ వివరాల ప్రకారం.. తిలక్‌నగర్‌ ప్రాంతానికి చెందిన గీతవైద్య భర్త దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుండగా గతేడాది మృతి చెందాడు. భర్త మృతితో గీతావైద్యకు అదే కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఆమెకు ఒక కుమార్తె ఉంది. మెడిసిన్‌ చదువుతోంది. తాను పనిచేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌ ఏదైనా ఇంటి దోషం పోవాలంటే ఎల్‌బీనగర్‌లో నివాసముండే శివస్వామికి చెప్పుకుంటే అన్ని తొలగిపోతాయని గీతావైద్యకు పరిచయం చేసింది. శివస్వామి తిలక్‌నగర్‌లో ఉన్న గీతా వైద్య ఇంటికి వచ్చి దోష నివారణకు పూజలు చేయించడం ప్రారంభించారు. మీ ఇంట్లో పెద్ద దోషం ఉందని అందుకే మీ భర్త చనిపోయాడని పూజలు చేయాలంటూ రూ.1.70 లక్షలు నగదు తీసుకున్నాడు. ఆ తర్వాత గీతా వైద్యను కనకదుర్గ ఆలయానికి తీసుకెళ్లి పూజలు చేయాలని మరో 20 తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నాడు. నీ పూజతో ఆలయ పూజారి చనిపోయాడని భయపెట్టి గీతా వైద్య ఇంటి డాక్యుమెంట్లను తీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గీత వైద్య కుమార్తె తల్లిని వెంట తీసుకొని శివస్వామి వద్దకు వెళ్లి పూజలు మంత్రాలు వద్దని తమ ఇంటి డాక్యుమెంట్లు ఇవ్వాలని గొడవ చేయడంతో భయపడి ఆ డాక్యుమెంట్లను ఇచ్చేశాడు. నగదు బంగారం ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ నెల 3న శివస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

జమిలి ఎన్నికలతో సమయం, ఖర్చు ఆదా

రాంగోపాల్‌పేట్‌: దేశంలో జమిలి ఎన్నికల నిర్వహిస్తే సమయం, ఖర్చు ఆదా అవుతుందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తాజ్‌ త్రిస్టార్‌లో వివిధ వ్యాపార వర్గాలతో జమిలి ఎన్నికలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ఐదేళ్ల పాటు ఎక్కడో ఓ చోట ఎన్నికలు జరుగుతుండడంతో ప్రధానమంత్రికి అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే సమయం ఉండడం లేదన్నారు. జమిలి ఎన్నికల ద్వారా 6 నెలల్లోపు అన్ని ఎన్నికలు పూర్తవుతాయని, తద్వారా మిగితా సమయం మొత్తం దేశం కోసం ఆలోచించే అవకాశంతో పాటు ప్రభుత్వానికి ఖర్చు కూడా తగ్గుతుందని అన్నారు. పదేళ్లలో ఎన్‌డీఏ పాలనలో ఏ కార్యక్రమం చేపట్టినా అది ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేసిందేనని కానీ ప్రతిపక్షాలు ప్రతిదానిని రాద్ధాంతం చేయడమే తప్పా మరేమి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షుడు భరత్‌గౌడ్‌, కార్పొరేటర్‌ సుచిత్ర, నాయకులు శ్రీకాంత్‌, రాజశేఖర్‌రెడ్డి, హరి, నందు పాల్గొన్నారు.

పిల్లలను గ్యాడ్జెట్లకు దూరంగా ఉంచండి

సాక్షి, సిటీబ్యూరో: పిల్లలు గ్యాడ్జెట్లకు దూరంగా ఉండేలా చూడాలని హైదరాబాద్‌ కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌ రెయిన్‌బో పిల్లల ఆస్పత్రిలో ఆటిజంపై 2 రోజుల జాతీయ సదస్సు ముగింపులో శనివారం ఆయన మాట్లాడారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజులు చాలా కీలకమని తెలిపారు. ప్రతిరోజూ పిల్లలు కనీసం పది వేల పదాలు వినేవిధంగా చూడాలని సూచించారు. ఆటిజం అనేది దీర్ఘకాలిక వ్యాధి అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. రెయిన్‌బో పిల్లల ఆస్పత్రి వైద్యులు బీవీ రామ్‌కుమార్‌, లోకేష్‌ లింగప్ప, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీడియాట్రిక్‌ న్యూరాలజిస్టులు, చైల్డ్‌ సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, థెరపిస్టులు, స్పెషల్‌ ఎడ్యుకేటర్లు సుమారు 250 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌ రామ్‌ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు



భరత్‌నగర్‌లో..



గోల్నాకల్లో బాబూ జగ్జీవన్‌రావు జయంతి వేడుకల్లో కృష్ణగౌడ్‌

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాసగౌడ్‌, విజయ్‌కుమార్‌గౌడ్‌

బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి వేడుకలు ముషీరాబాద్‌, అంబర్‌పేట నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని జగ్జీవన్‌రామ్‌ విగ్రహాల వద్ద నివాళి అర్పించారు. గోల్నాక చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌, కార్పొరేటర్లు నివాళి అర్పించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సామాజిక అసమాతలను తొలగించేందుకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్‌ అని కొనియాడారు.

ముషీరాబాద్‌, అంబర్‌పేట జోన్ల బృందం



గోల్నాకలో బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌



జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



బాబూ జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జి.ఎన్‌. కేశవ్‌ తదితరులు



జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



భోలక్‌పూర్‌లో జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్‌రావు



జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రఫుల్‌ రాంరెడ్డి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌.



హరినగర్‌ చౌరస్తాలో..



మోహన్‌నగర్‌ కమ్యూనిటీ హాల్‌ వద్ద..



నివాళి అర్పిస్తున్న నవీన్‌గౌడ్‌, నందు



అరుంధతినగర్‌లో..

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ హామీలను అమలు చేయాలి

కాచిగూడ: సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకొని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌ యాదవ్‌ డిమాండ్‌ చేశారు. శనివారం కాచిగూడ చెప్పల్‌బజార్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలును కేంద్ర ప్రభుత్వంపై నెట్టేందుకు కాంగ్రెస్‌ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను బీసీలందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రేవంత్‌ రెడ్డి కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా బీసీలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. స్థానికంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్నా, కాంగ్రెస్‌ ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రానికి పంపి, 9వ షెడ్యూల్‌ పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం లేకుండానే రిజర్వేషన్లు



మాట్లాడుతున్న వినోద్‌యాదవ్‌

అమలు చేసే అవకాశాలున్నా, కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని పక్షంలో బీసీలకు క్షమాపణ చెప్పి సీఎం పదవి నుంచి తప్పుకుని బీసీలకు సీఎంగా అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌, ఎస్‌.నర్సింగ్‌రావు, కిషోర్‌ కుమార్‌, ప్రకాష్‌ సింగ్‌, ఆవుల నరేష్‌, ఆవుల మధు, రవీందర్‌ ఆనంద్‌ దాస్‌ పాల్గొన్నారు.

15న ఓయూలో జార్జిరెడ్డి సంస్మరణ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి, పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి సంస్మరణ సభను ఈనెల 15న నిర్వహించనున్నట్లు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ అధ్యక్షుడు డా.ఎస్‌ నాగేశ్వర్‌ రావు తెలిపారు. ఆర్ట్స్‌ కాలేజీ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. జార్జిరెడ్డి స్ఫూర్తితో ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి పోరాడాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్‌ 5 నుంచి 15 వరకు జార్జిరెడ్డి అమరత్వం యాదిలో పేరిట సంస్మరణ సభలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుమంత్‌, బాలికల కన్వీనర్‌ కె.స్వాతి, సహాయ కార్యదర్శి మందా సురేష్‌, ఓయూ నాయకులు రుక్మత్‌ పాషా, సతీశ్‌, సంతోష్‌, కాంత్రి, తిరుపతి, రంజిత్‌, శ్రీను, గ్రేటర్‌ నేత వెంకటేష్‌, కార్యదర్శి కోటేశ్వర్‌ పాల్గొన్నారు.

ముగిసిన సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కొనసాగుతున్న అంతర్‌ కళాశాలల సాంస్కృతిక పోటీలు శనివారం ముగిశాయి. ఠాగూర్‌ ఆడిటోరియంలో రెండు రోజులు పాటు జరిగిన పోటీల్లో భారతీయ, పాశ్చాత్య, జానపద సంగీతం మూడు విభాగాల్లో బృందగానం, సోలో, భారతీయ, వెస్ట్రన్‌, జానపద కళారీతులతో విద్యార్థులు సృజనాత్మకతను చాటుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన అభ్యర్థుల జాబితాను వచ్చే వారం ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. బహుమతులను ఈ నెల 26న ఓయూ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రదానం చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

బన్సీలాల్‌పేట్‌: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత్‌ వికాస్‌ పరిషత్‌, కిమ్స్‌ ఆసుపత్రి సిబ్బంది రోగులను పరీక్షించి పలు సలహాలు, సూచనలు అందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ కె. హేమలత, జనహిత సేవా ట్రస్ట్‌ ప్రతినిధులు నరసింహమూర్తి, వెంకటనారాయణ, నర్సింగ్‌రావు, నాగశేఖర్‌ గుప్తా, రఘు, సతీశ్‌, జీహెచ్‌ఎంసీ ఏఎంసీ దయానంద్‌, మనీశ్‌, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణకు చర్యలు

నల్లకుంట: నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ పేర్కొన్నారు. శనివారం నల్లకుంట డివిజన్‌ మయూరీ లేన్‌(స్ట్రీట్‌ నంబర్‌ 4)లో సుమారు రూ.9 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్‌ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజీ, సీవరేజీ పైపులు చాలా ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరాయన ప్రజల నుంచి ఫిర్యాదు రావడంతో జలమండలి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి కొత్తవి ఏర్పాటు చేయించేందుకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. మయూరీ లేన్‌లో చేపట్టనున్న డ్రైనేజీ పనులను ఎప్పటి



స్ట్రీట్‌ నంబర్‌-4లో శిథిలామైన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

కప్పుడు పర్యవేక్షిస్తూ మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట ప్రమోద్‌కుమార్‌, రాంజగదీష్‌ పరిమల రావు, గణేష్‌, రామ్మోహన్‌, రాఘవేంద్ర, శ్రీకాంత్‌, వరదరాజ్‌ ఉన్నారు.

వర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకాలపై నిర్లక్ష్యం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ నియామకాల భర్తీపై సీఎం రేవంత్‌ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ డాక్టరేట్స్‌ అసోసియేషన్‌ నాయకులు డా.నరేందర్‌ రెడ్డి, డా.ద్యాత్రిక స్వత్న శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4న రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు, వీసీ, విద్యా కమిషన్‌ చైర్మన్‌, ఇతర విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడం బాధకరమన్నారు. ఓయూలో 14 ఏళ్లుగా అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో పర్మినెంట్‌ ప్రొఫెసర్లు కేవలం 200 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ల కొరతతో పీహెచ్‌డీ పరిశోధనలు సైతం కుంటుపడ్డాయన్నారు. ఇప్పటికైనా అధ్యాపకుల ఉద్యోగాల భర్తీపై సీఎం చొరవ చూపాలని కోరారు.



కల్యాణ వేడుకలకు ముస్తాబు చేసిన న్యూరామాలయంలో సీతారామచంద్ర స్వాముల ఉత్సవ విగ్రహాలు



షామియనాలు పందిళ్లతో అందంగా ముస్తాబుచేసిన శ్రీ లక్ష్మీగణపతిదేవాలయం



వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో..

రాములోరి కల్యాణానికి రారండోయ్‌!

కలాణ వైభోగమే.. శ్రీసీతారాముల కల్యాణ వైభోగమే అంటూ రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ముషీరాబాద్‌, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని ఆయా దేవాలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల ముందు చలువ పందిళ్లు, ప్రత్యేక అలంకరణలతో కల్యాణానికి ఏర్పాటు చేశారు.

–ముషీరాబాద్‌, అంబర్‌పేట జోన్ల బృందం



శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో చలువ పందిళ్లతో అందంగా ముస్తాబు చేసిన ఆంజనేయస్వామి ఆలయం



కల్యాణానికి ముస్తాబైన ఉత్సవ విగ్రహాలు



సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రశాంత్‌నగర్‌ పుర వీధుల్లో పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం



పల్లకీ సేవలో పాల్గొన్న మహిళలు

మానసిక ఆరోగ్యానికి రక్షకులు సైకాలజిస్టులు



మాట్లాడుతున్న, రాంచందర్‌

కాచిగూడ: సైకాలజిస్టులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ సమాజంలో మారుతున్న మానసిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు చేయడం అత్యవసరమని తెలంగాణ సైకాలజిస్ట్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ మోతుకూరి రాంచందర్‌ అన్నారు. శనివారం నారాయనగూడలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ రోజుల్లో మానవ సంబంధాల్లో చీలికలు, జీవనశైలి వేగం, ఉద్యోగ ఒత్తిడులు, వ్యక్తిగత సమస్యలు మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో సైకాలజిస్టుల పాత్ర మరింత కీలకమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సైకాలజీ రంగానికి గౌరవం తీసుకురావడానికి ప్రతి సభ్యుడు కృషి చేయాల్సిన అవసరం ఉందని, సమాజానికి మరింత చేరువయ్యేలా కార్యాచరణలు రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏముల సుధాకర్‌, బి.నారాయణ రావు, డాక్టర్‌ శశికిరణ్‌, రాజు, బాలసుబ్రహ్మణ్యం, సౌజన్య, వసుంధర తదితరులు పాల్గొన్నారు.